నమస్తే తెలంగాణ
# వికారాబాద్
13 | హైదరాబాద్, గురువారం 22 ఫిబ్రవరి 2024 | VIKARABAD

# చెంతనే వైద్యం

## సత్ఫలితాలు ఇస్తున్న బస్తీ దవాఖానలు




- పట్టణ శివారు ప్రాంత ప్రజలకు వరంలా బస్తీ దవాఖానలు
- కేసీఆర్ ప్రభుత్వంలో జిల్లాలో 70 బస్తీ దవాఖానల ఏర్పాటు
- ఏడాది కాలంగా దిగ్విజయంగా నిర్వహణ
- మరింత భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు
- 18 దవాఖానల్లో డాక్టర్ల నియామకానికి వైద్యారోగ్యశాఖ కసరత్తు

రంగారెడ్డి, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చిన కేసీఆర్ ప్రభుత్వం గత ఏడాది జిల్లాలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలు ప్రజల ఆదరణను చూరగొంటున్నాయి. ఎక్కడో దూర ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా వైద్యం పొందేలా నెలకొల్పిన ఈ దవాఖానలు అపర సంజీవనీలుగా సేవలందిస్తున్నాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన 70 దవాఖానలు దిగ్విజయంగా నడుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ దవాఖానలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నది. 18 దవాఖానల్లో డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో వాటి భర్తీకి జిల్లా వైద్యారోగ్య శాఖ సన్నాహాలు చేస్తున్నది. ఈ ప్రక్రియ పూర్తయితే ఆసుపత్రులకు డాక్టర్ల కొరత పూర్తిగా తీరనున్నది.

**సేవల్లో సూపర్ హిట్..**

బస్తీల్లో సుస్తీ పోగొట్టేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలు జిల్లాలో సూపర్ హిట్ అయ్యాయి. జిల్లా ఆసుపత్రితోపాటు, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు ప్రజానీకానికి మెరుగైన వైద్య సేవలు అందిస్తూ వస్తున్నాయి. పట్టణ శివారు గ్రామాల విలీనంతో నగరాలు, పట్టణాల పరిధి పెరిగింది. పల్లె దవాఖానల మాదిరిగానే బస్తీల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంకల్పించి కేసీఆర్ ప్రభుత్వం బస్తీ దవాఖానలను అందుబాటులోకి తెచ్చింది. 5వేల నుంచి 10వేల జనాభాకు అనుగుణంగా బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి జిల్లా వ్యాప్తంగా 70 బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసి వైద్య సేవలను మొదలు పెట్టింది.

**తప్పిన వ్యయ ప్రయాసలు..**

బస్తీ దవాఖానలు ఏర్పాటు కాక ముందు బస్తీలు, కాలనీల్లోని ప్రజలు జ్వరం, దగ్గు, జలుబు.. ఇలా ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. రాను పోను ఖర్చులతోపాటు వైద్య ఖర్చులు కలిసి తడిసి మోపెడయ్యేవి. బస్తీ దవాఖానలు ఏర్పాటయ్యాక వైద్యం చెంతకే చేరడంతో వ్యయ ప్రయాసలు పూర్తిగా తప్పాయి. సత్వర వైద్యం అందిస్తుండడంతోపాటు డాక్టర్లు ఉచితంగా వైద్యం అందించి మందులను అందజేస్తుండడంతో స్థానికులు బస్తీ దవాఖానలకు క్యూ కడుతున్నారు. వివిధ ఆరోగ్య సమస్యలపై బస్తీ దవాఖానలకు వచ్చి సేవలు పొందుతున్న వారి సంఖ్య నిత్యం 40–80 మధ్య ఉంటోంది. బస్తీ దవాఖానల ఏర్పాటుతో ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకునే బాధ తగ్గిందని బస్తీ వాసులు పేర్కొంటున్నారు.

**డాక్టర్ల నియామకానికి కసరత్తు..**

ప్రతి దవాఖానలో మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సు, స్వీపర్, ఆయా జిల్లాలో 18 బస్తీ దవాఖానల్లో డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ సన్నాహాలు చేస్తున్నది. మెడికల్ ఆఫీసర్లుగా ఎంబీబీఎస్ చదివిన వారిని నియమించేందుకుగాను ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. సర్టిఫికేషన్, ఇంటర్వ్యూ తదితర ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో త్వరలోనే బస్తీ దవాఖానల్లో డాక్టర్ల కొరత తీరనున్నది.



ధారూరు మండలం ఎబ్బనూరు చెరువు

- వికారాబాద్ జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఇప్పటికే 3.73 మీటర్ల లోతుకు పడిపోయిన నీటి నిల్వలు
- గతేడాది జనవరిలో 8.25 మీటర్లలో నీరు.. ప్రస్తుతం 11.98 మీటర్ల లోతులో..
- అత్యధికంగా మర్పల్లి మండలం నర్సాపూర్‌లో 33.35 మీటర్లకు తగ్గిన నీటి నిల్వలు
- వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లా యంత్రాంగం ప్రణాళికలు

# పాతాళానికి వేగంగ..

వికారాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. వేసవికి ముందే నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడం అన్నదాతలను ఆందోళన కలిగిస్తున్నది. ఫిబ్రవరి మొదటి వారం నుంచి చలితోపాటు ఎండ తీవ్రత కూడా పెరుగడంతోనే ఈ పరిస్థితి నెలకొన్నదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. గతేడాది జనవరితో పోలిస్తే ఈ జనవరి చివరి నాటికి 3.73 మీటర్ల మేర భూగర్భ నీటి నిల్వలు తగ్గాయి. అప్పుడు 8.25 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు.. ప్రస్తుతం 11.98 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఏప్రిల్, మే నెలల్లో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే మెజార్టీ చెరువుల్లో నీటి నిల్వలు క్రమంగా తగ్గుతున్నాయి. మరోవైపు వేసవిలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన ముందస్తు చర్యలను చేపట్టింది. మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు, కొత్త పైపులైన్ల నిర్మాణం, గ్రామ పంచాయతీల్లోని పంపుసెట్లకు మరమ్మతులు వంటి పనులను చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది.

**11.98 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు..**

జిల్లాలో సగటున 11.98 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. అత్యధికంగా మర్పల్లి మండలం నర్సాపూర్‌లో 33.35 మీటర్ల లోతుకు భూగర్భ నీటి మట్టాలు పడిపోయాయి. నవాబుపేట మండలం మాదిరెడ్డిపల్లిలో 24.36 మీటర్లు, బొంరాసుపేట మండలంలోని అంసన్‌పల్లిలో 27.10 మీటర్లు, గౌరారంలో 26.35 మీటర్లు, బూరాన్‌పూర్‌లో 15.16 మీటర్ల లోతుకు చేరుకున్నాయి. పెద్దేముల్ మండలంలోని నాగులపల్లిలో 32.50 మీటర్లు, దోమ మండలం దిర్సంపల్లిలో 18.40 మీటర్లు, యాలాల మండలంలోని దేవనూర్‌లో 24.59 మీటర్లు, మర్పల్లి మండలం దర్గుపల్లిలో 19.56 మీటర్లు, మర్పల్లిలో 15.70 మీటర్లు, వికారాబాద్ మండలం మైలార్‌దేవ్‌పల్లిలో 15.48 మీటర్లు, ధారూరు మండలం అంతారంలో 15.56 మీటర్లు, దోమలో 15.93 మీటర్లు, కోట్‌పల్లిలో 15.38 మీటర్లు, కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో 14.82 మీటర్లు, పరిగిలో 13.92 మీటర్లు, రాపోల్‌లో 15.13 మీటర్లు, తాండూరు మండలంలోని ఉద్దండాపూర్‌లో 22.64 మీటర్లు, జినగుర్తిలో 21.20 మీటర్లు, కొడంగల్ మండలం ఉప్పర్‌పల్లిలో 13.14 మీటర్ల లోతుకు భూగర్భ నీటిమట్టాలు పడిపోయాయి.

**రూ.5.51 కోట్లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్..**

గ్రామ పంచాయతీల్లో వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడిని పరిష్కరించేందుకుగాను రూ.5.51 కోట్లతో జిల్లా మిషన్ భగీరథ అధికారులు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లకుగాను పరిగి సబ్ డివిజన్‌కు రూ.1.30 కోట్లు, కొడంగల్ సబ్ డివిజన్‌కు రూ.1.04 కోట్లు, తాండూరు సబ్ డివిజన్‌కు రూ.1.62 కోట్లు, వికారాబాద్ సబ్ డివిజన్‌కు రూ.1.54 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లోని 1446 వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయడంతోపాటు నీటిలో బ్లీచింగ్ వేసేందుకుగాను రూ.1.14 కోట్లు అవసరమని అంచనా వేశారు. పైపులైన్ లికేజీల మరమ్మతులకు సంబంధించి జిల్లావ్యాప్తంగా రూ.2.39 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. పరిగి నియోజకవర్గానికి రూ.54.83 లక్షలు, కొడంగల్ సబ్ డివిజన్‌కు రూ.51.15 లక్షలు, తాండూరు సబ్ డివిజన్‌కు రూ.63.15 లక్షలు, వికారాబాద్ సబ్ డివిజన్‌కు రూ.70.1 లక్షలు అవసరమని యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 3360 పంపుసెట్లు ఉండగా, వీటిలో పరిగిలో 1176 పంపుసెట్లు, కొడంగల్ సబ్ డివిజన్‌లో 434 పంపుసెట్లు, తాండూరు సబ్ డివిజన్‌లో 1008 పంపుసెట్లు, వికారాబాద్ సబ్ డివిజన్‌లో 742 పంపుసెట్లు ఉన్నాయి. పాడైన పంపుసెట్లను మరమ్మతులు చేసేందుకుగాను రూ.1.97 కోట్లు అవసరమని అంచనా వేశారు, వీటిలో పరిగికి రూ.60.40 లక్షలు, కొడంగల్‌కు రూ.21.70 లక్షలు, తాండూరుకు రూ.56.25 లక్షలు, వికారాబాద్‌కు రూ.59.55 లక్షలు అవసరమని అధికారులు అంచనా వేశారు.





ధారూరు మండలం మున్నూర్ సోమారం చెరువు




కొడంగల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న అప్పాయిపల్లి రైతులు

### రైతులను అరెస్టు చేయడమేనా..

## ప్రజా పాలనంటే..?

- పేద రైతుల భూములను తీసుకోబోమని సీఎం ప్రకటించాలి
- అప్పాయిపల్లి రైతుల డిమాండ్

వికారాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 19లోని పేద రైతుల భూములను తీసుకోకూడదని నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా బుధవారం సీఎం పర్యటన సందర్భంగా కొంతమంది రైతులను అరెస్టు చేసి మిగతా వారిని భయపట్టేలా అధికారులు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు. రైతుల ఉద్యమాన్ని నీరుగార్చే విధంగా కొంతమంది బ్రోకర్లు, కమీషన్ ఏజెంట్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కుట్రలో భాగంగానే రెవెన్యూ, పోలీసు డిపార్ట్‌మెంట్ వాళ్లతో కుమ్మక్కై రైతులను అరెస్టు చేయించారని ఆరోపించారు. ఇది దుర్మార్గమైన చర్య అని రైతులు శ్రీనివాస్, పకీరప్ప, నర్సప్ప, మోతీబాయి, బాలప్ప తదితరులు ఆరోపించారు. రైతులను అరెస్టు చేయడమే ప్రజా పాలనా.. అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. 19 సర్వే నంబర్‌లోని పేదల భూములను తీసుకోబోమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించాలని, ఇక్కడ ఎవరు చనిపోయినా.. ఎటువంటి ఇబ్బంది కలిగినా సీఎం రేవంత్‌రెడ్డిదే పూర్తి బాధ్యత అని పేర్కొన్నారు.

### వృత్తిపరమైన

## నైపుణ్యాలను పెంచుకోవాలి

– సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): శిక్షణలో సంస్థాగత విలువలు పాటిస్తూ, సమాజంపై పూర్తి అవగాహన పెంపొందించుకుంటూ వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచుకోవాలని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి సూచించారు. కొత్తగా నియామకమైన స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు 9 నెలల పాటు జరిగే బెసిక్ ఇండక్షన్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిద్దిపేట, మెదక్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం యూనిట్లకు చెందిన 196 మందికి శిక్షణ ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం సాధించడం కోసం కొన్ని లక్షల మంది నిరుద్యోగులు ఆహోరాత్రులు కష్టపడి చదివి ఈవెంట్స్ ప్రాక్టీస్ చేస్తారని, అందులో కొందరికే ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుందన్నారు. అందులో మీరు ఉన్నారని, తెలంగాణ పోలీసులకు దేశంలోనే బెస్ట్ పోలీసింగ్‌గా గుర్తింపు ఉన్నదన్నారు. జాయింట్ సీపీ ట్రాఫిక్, జోయెల్ డేవిస్ మాట్లాడుతూ 9 నెలల శిక్షణపైనే సర్వీస్ మొత్తం ఆధారపడి ఉంటుందని, శిక్షణలో అన్ని విషయాలు తెలుసుకోవాలని, సోషల్‌మీడియాపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపల్ డీసీపీ ఎల్‌సీ నాయక్ పాల్గొన్నారు.



### హోటళ్లలో క్వాలిటీ లేకుంటే

# కఠిన చర్యలే

### స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్న బల్దియా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : నాణ్యతా ప్రమాణాలను పాటించని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులపై ఉక్కుపాదం మోపేందుకు బల్దియా ప్రత్యేక డ్రైవ్‌కు సిద్ధమైంది. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న ఆయా సెంటర్లపై తనిఖీలు ముమ్మరం చేయనున్నారు. వాస్తవంగా కోటికి పైగా జనాభా కలిగిన గ్రేటర్‌లో దాదాపు 12 నుంచి 14 వేల వరకు హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయిల్ నుంచి మొదలు ఉప్పు వరకు నాణ్యమైన వాటిని వినియోగించి నిర్వాహకులు క్వాలిటీ ఫుడ్‌ను అందించాలి. జీహెచ్‌ఎంసీ స్టాంప్ వేసిన మాంసాన్ని వాడాలి. కానీ నియమ, నిబంధనలను పక్కన పెట్టేసి ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వాహకులు వ్యాపారాన్ని సాగిస్తున్నారు. వంట గదుల్లో పరిశుభ్రత పాటించడం లేదు. ఫుడ్ తయారీలో కల్తీ వస్తువులను ప్రోత్సహిస్తున్నారు. పైగా పాచిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తిరిగి వేడి చేసి పెడుతున్నారు. మాంసం అయితే రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టి దానికి మాసాలాలు దట్టించి.. మరుసటి రోజు వాడుతున్నారు. బిర్యానీలో బొద్దింకలు, వెంట్రుకలు వస్తున్న సందర్భాలు లేకపోలేదు. ఈ జాబితాలో చిన్న హోటళ్లు నుంచి బడా హోటళ్ల నిర్వాహకులు ఉంటున్నారు. తరచూ జీహెచ్‌ఎంసీకి నిత్యం 10 వరకు పైగా ఫిర్యాదులు ఇలాంటివే ఎక్కువగా వస్తున్నాయి. మెరుగైన పౌర సేవలు, ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో బల్దియా కల్తీరాయుళ్ల భరతం పట్టాలని నిర్ణయించింది.ఈ మేరకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి నాణ్యత పాటించని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులకు తొలుత జరిమానాలు, ఆ తర్వాత సంబంధిత వాటిని సీజ్ చేయడం వంటి చర్యలు చేపట్టనున్నది. కల్తీ ఉన్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదులు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఆహార నాణ్యతా ప్రమాణాల విషయంలో అనుమానాలుంటే జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ నంబరు 040– 2111 1111లో సంప్రదించాలని అధికారులు కోరారు. కాగా హాని కలిగించే విధంగా వ్యాపారం చేసిన వారు ఇప్పటికే పలు యాక్టుల కింద కోర్టులో కేసులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం 119 సీసీ కేసులు నడుస్తున్నాయని అధికారులు తెలిపారు.



**ఎక్కడ కనిపించని ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్**

రోజు వాడే ఆహార పదార్థాలలో కల్తీ జరుగకుండా నిరంతర పర్యవేక్షణ చేసేందుకు ఫుడ్ సెక్యూరిటీ స్టాండెడ్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్’ మొబైల్ వ్యాన్ రోజుకో సర్కిల్‌లో ఉండాలి. కానీ గడిచిన కొన్ని రోజులుగా ఈ వాహనం ఎక్కడా కనిపించడం లేదు. ప్రభుత్వంలో పెద్దల మెప్పు పొందే వీలుగా ఈ వాహనాన్ని కొందరు అధికారులు పక్కదారి పట్టించినట్లు చర్చ జరుగుతున్నది. వెంటనే సర్కిల్‌లో ఈ వాహనంతో మొదటగా అవగాహన, టెస్టింగ్, ట్రైనింగ్ వీధి వ్యాపారులకు కల్పించాలని డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి.

**ఆహార కల్తీ విషయంలో తీసుకున్న చర్యలు**

**2021 సంవత్సరంలో**

| | |
|---|---|
| తనిఖీలు | -12375 |
| నోటీసులు జారీ చేసినవి | -926 |
| సేకరించిన ఆహార నమూనాలు | -978 |
| ఉల్లంఘనలు | -129 |
| భద్రత లేనివి | -33 |
| తక్కువ ప్రమాణాలతో ఉన్నవి | -64 |
| మిస్‌బ్రాండ్ కలిగి ఉన్నవి | -32 |

**2022 సంవత్సరంలో**

| | |
|---|---|
| తనిఖీలు | -17209 |
| నోటీసులు జారీ చేసినవి | -3962 |
| సేకరించిన ఆహార నమూనాలు | -2322 |
| ఉల్లంఘనలు | -279 |
| భద్రత లేనివి | -32 |
| తక్కువ ప్రమాణాలతో ఉన్నవి | -94 |
| మిస్‌బ్రాండ్ కలిగి ఉన్నవి | -153 |

**2023 సంవత్సరంలో**

| | |
|---|---|
| తనిఖీలు | -14889 |
| నోటీసులు జారీ చేసినవి | -3803 |
| సేకరించిన ఆహార నమూనాలు | -2534 |
| ఉల్లంఘనలు | -311 |
| భద్రత లేనివి | -34 |
| తక్కువ ప్రమాణాలతో ఉన్నవి | -265 |
| మిస్‌బ్రాండ్ కలిగి ఉన్నవి | -12 |

**ఫిర్యాదు కోసం**
**040- 2111 1111**

# నేడే బలపరీక్ష

- ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన 11మంది డైరెక్టర్లు
- సంతకాలు డైరెక్టర్లవి కావంటూ కోర్టుకెళ్లిన చైర్మన్, వైస్ చైర్మన్లు
- నేడు శేరిగూడలోని సహకార బ్యాంకులో సమావేశం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్ల బలపరీక్ష గురువారం జరుగనున్నది. వారిపై డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. డీసీవో ధాత్రిదేవి అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు శేరిగూడలోని సహకార బ్యాంకు కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. ఉప్పరిగూడ సహకారసంఘం పరిధిలో మొత్తం 13మంది డైరెక్టర్లు ఉన్నారు. గత ఎన్నికల్లో సంఘం చైర్మన్‌గా సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా శంకర్ బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికయ్యారు. కాగా, బీఆర్‌ఎస్‌కు చెందిన 5మంది డైరెక్టర్లు ఇటీవల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన 6 మంది, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 5 మంది మొత్తం 11మంది చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

**సహకార సంఘం పరిధిలో 144 సెక్షన్..**

బలపరీక్ష నేపథ్యంలో సహకార సంఘం చుట్టుపక్కల 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

**కోర్టును ఆశ్రయించిన చైర్మన్, వైస్ చైర్మన్..**

అవిశ్వాస తీర్మానంలో పెట్టిన సంతకాలు డైరెక్టర్లవి కావని, తీర్మానం ప్రవేశపెట్టిన తర్వాత మరో డైరెక్టర్‌తో సంతకం చేయించారని చైర్మన్, వైస్ చైర్మన్లు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిన తర్వాతే అవిశ్వాస తీర్మానం పెట్టేలా చూడాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. డైరెక్టర్లకు అవిశ్వాసంపై బలపరీక్షకు హాజరు కావాలని నోటీసులు అందినందున యథావిధిగా బలపరీక్ష నిర్వహించి పూర్తి నివేదికను తమకు అందజేయాలని కోర్టు ఆదేశించింది. మార్చి 7న పూర్తి నివేదికతో కోర్టుకు రావాలని, ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని కోర్టు డీసీవోను ఆదేశించినట్లు తెలిసింది.

**28న బాటసింగారం సహకార సంఘం చైర్మన్ అవిశ్వాసంపై బలపరీక్ష..**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని బాటసింగారం సహకార సంఘం చైర్మన్‌పై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఈ నెల 28న బలపరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సంఘం పరిధిలోని 9 మంది డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. మరోవైపు పోల్కంపల్లి సహకార సంఘం చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి నేడు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.



ఉప్పరిగూడ సహకార సంఘం